# ఆశ చావదు

"అమ్మగారూ ఒంటిగంట దాటింది. ఇంకా ఎప్పుడు భోంచేస్తారూ రండి. మరీ పొద్దుపోతే మీకు అరగదు కూడానూ" అంది వంట మనిషి వెంకటలక్ష్మి.

"నా కాకలిగా లేదు. నువ్వు తినెయ్యి" అంది అపర్ణ.

"అమ్మగారూ! మీరు రాత్రి కూడా భోంచెయ్యలేదు. ఉదయం నుంచీ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. నా మాట విని కొంచెం ఎంగిలి పడండి." బతిమాలింది వెంకటలక్ష్మి.

అపర్ణ మాట్లాడలేదు.

వెంకటలక్ష్మి మంచం దగ్గరికెళ్ళి మెల్లగా చెయ్యిపట్టుకుని లేపబోయింది.

"నువ్వెళ్ళు. నేవొస్తాలే" అంది అపర్ణ.

వెంకటలక్ష్మి టేబుల్ మీద కంచం, గ్లాసూ పెట్టింది.

అపర్ణ లేవబోయింది అడుగులు తడబడ్డాయి. స్వాధీనంలోకి రాని మోకాళ్ళని సరిచేసుకుంటూ, కుంటుతూ కుంటుతూ వెళ్ళి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంది.

నీళ్ళు కమ్ముతున్న కళ్ళను చీర కొంగుతో అద్దుకొంటూ, వెంకటలక్ష్మి వడ్డించిన పదార్థాలకేసి చూసింది. తన కిష్టమని వెంకటలక్ష్మి కందిపచ్చడీ, గుత్తొంకాయ కూరా చేసింది. పచ్చడి కలుపుకుని రెండు ముద్దలు నోట్లో పెట్టుకుంది. రుచించలేదు. వెంటనే కంచంలో చెయ్యి కడుక్కుని లేచి వెళ్ళిపోయింది.

ఎండిపోయిన నూతిలా గుంటలు పడ్డ కళ్ళల్లో కన్నీటి బిందువులు చోటుచేసుకున్నాయి.

"ముకుల్!.... ఈరోజు కూడా ఉత్తరం రాయలేదు.... "తనలో తనే గొణుక్కుంది అపర్ణ, వొణుకుతూన్న చేతులతో చీరకొంగుతో పదే పదే కళ్ళు తుడుచుకుంటూ.

"ముకుల్! అమ్మగా కాకపోయినా ఒక ముసలమ్మగానైనా నీకు గుర్తే రావడంలేదా?" కన్నీటి ధారల మధ్య పదే పదే గుణుక్కుంటోంది అపర్ణ.

"ఎందుకు గుర్తుకొస్తావు ... అసలు ఎందుకు గుర్తుకురావాలి?" ఎవరో అంటూన్నట్టుగా అనిపించాయా మాటలు. ఉలిక్కిపడింది. అవి తన మన సంటూన్న మాటలే!

అంత బాధలోనూ తనని చూసి తనకే నవ్వొచ్చింది.

అంతలోనే తన అవస్థకి ఏడుపొచ్చింది!

"నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వొస్తాయి" అన్న కవిగారి మాటలు జ్ఞాపకం వొచ్చాయి.

"ఏమిటో ఈ బతుకు?" అనుకుంటూ శూన్యంలోకి చూస్తూ కూర్చుండి పోయింది అపర్ణ.

అపర్ణ అరవై వసంతాలు చూసింది. అయితే, గడచిన పది వసంతాలు ఒంటరిగా ఇలాగే ప్రతిరోజూ ముకుల్ కోసం ఎదురు చూస్తూ, కనీసం అతడు రాసిన ఉత్తరమైనా వొస్తుందేమోనని కొండంత ఆశతో చూస్తూ, అహర్నిశలూ అతణ్ణే కలవరిస్తూ, కళ్ళల్లో వొత్తులు వేసుకుని క్షణ మొక యుగంగా, దిన, దిన గండంగా ఏళ్ళు గడిపేసింది జీవచ్ఛవంలా. కాలానికే వసంతం కానీ, తన జీవితంలో శిశిరమే మిగిలినా ముకుల్ తప్పకుండా వొస్తాడూ అన్న ఆశ ఆమెకి ప్రాణం పోస్తోంది.

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా ఆమె కళ్ళు ఎదురు చూస్తునే వుంటాయి. చీకట్లు అలుముకున్న కొద్దీ మనసుతో బాధ నిండిపోతుంది. కళ్ళు వర్షిస్తూనే వుండాయి. గుండె దడ వేగంగా కొట్టుకుంటుంది. కదలలేని శరీరం బాధగా మెల్లగా అటూ ఇటూ దొర్లి దొర్లి ఏ నడిఝాముకో మగతలో మునిగిపోతుంది.

మెలకువ వొస్తే ఆవేశం!

ఆవేశంలో నవ్వూ, వెంటనే ఏడుపు!

ఆ తరవాత శూన్యంలోకి చూస్తు కూర్చుంటుంది అలిసిపోయేదాకా.

అటుపైన కాస్త కలత నిద్ర!

అంతలోనే రేపు అనే రోజుపైన ఏదో కొత్త ఆశ!

ఆ ఆశలో ముకుల్ కనిపిస్తాడు!

మళ్ళీ ఆవేశం, ఆనందం, నవ్వూ, ఏడుపూ!

అప్పుడప్పుడు పలకరించడానికీ, ఏదైనా తినిపించడానికి వెంకటలక్ష్మి తోడు.

అపర్ణంటే వెంకటలక్ష్మికి ప్రేమా, అభిమానం అనడం కన్నా, అడిగినంతా జీతం ఇచ్చి, రెండు పూటలా భోజనం పెట్టి కాఫీ ఫలహారాలతో పాటు స్వాతంత్ర్యం కూడా బోలెడంత వున్నందుకు ఆమెకు ఆ ఇల్లంటే ఇష్టం, అపర్ణ అంటే జాలి.

పడమటింటికి వెళ్ళిన సూర్యుణ్ణి వెతుక్కుంటూ సాయంసంధ్య వడివడిగా పరుగెడుతోంది. నిశీథి ఆకాశాన్ని నింపేస్తోంది.

అపర్ణ ఆలోచిస్తోంది.

ఆలోచించడం కాదు, గతంలోకి జారిపోయి జరిగిపోయిన సంఘటనలను ఒక్కొక్కటే గుర్తుకు తెస్తోంది మనసు! అవన్నీ కళ్ళముందు కదలాడుతూంటే నెమరువేసుకుంటోంది మనసు.

"మనసు గతి ఇంతే! మనిషి బ్రతుకింతే!" అన్న కవీంద్రుడి మాటలు గుర్తుకొచ్చి శూన్యంలోకి చూస్తు కూర్చుంది అపర్ణ.

* * * *

ఆ రోజు కాలేజీ గేటు దగ్గర కంగారుగా బోటనీ టెక్స్ట్ బుక్‌ని తన చేతిలో పెట్టేసి, గబ గబా నడుచుకుంటూ వెళ్ళిపోయిన అజయ్‌ని చూసి అతని ప్రవర్తన అర్థంకాక, పుస్తకాన్ని తెరిచి చూసింది. అందులో గులాబీ రంగు పల్చటి కాగితం మీద నీలం రంగు ముత్యాల్లాంటి దస్తూరి ఎంతో అందంగా కనిపించింది. వెంటనే చదివింది

"డియర్ అపర్ణా! ఐ....లవ్....యూ! నువ్వంటే నాకెంతో ఇష్టం నీ నవ్వంటే మరీ మరీ ఇష్టం. నువ్వు సరేనంటే నీతో పెళ్ళికి నేను సిద్ధం. నువ్వు ఇష్టపడితే, మా వాళ్ళని మీ వాళ్ళతో మాట్లాడించి పెట్టించేస్తాను ముహూర్తం. ముఖాముఖీగా చెప్పలేక పోయాను నీతో ఈ విషయం. అందుకే రాశాను. ఉత్తరం. నీకిష్టమయితే వెయిట్ చెయ్యి గేటు దగ్గర నాలుగు గంటలకి ఈ సాయంత్రం! ఇట్లు అజయ్‌కుమార్."

ఉత్తరం చదివి నవ్వుకుంది అపర్ణ. గర్వరేఖ ఆమె మొహంలోకి తొంగి చూసింది. పసిమి రంగుతో మిల మిలలాడుతున్న శరీరాన్ని తేసి ముంపెంగా చూసుకుంది. రెప రెపా కొట్టుకొంటూన్న కనురెప్పల కింద మీనాల్లా దాక్కున్న చక్రాల్లాంటి కళ్ళను తలుచుకుని పొంగిపోయింది. వీపు పైనుంచి వేలాడుతున్న నల్లతాచులాంటి జడని చూసి సత్యభామలా ఊహించు కుంది. పొడుచుకొస్తున్న వక్షోజాలని చూసి సిగ్గుతో మొగ్గలా ముడుచుకు పోయింది. ఏవేవో ఆలోచనలు. అజయ్ అంటే కోపం కూడా వొచ్చింది.

సాయంత్రం నాలుగు గంటలకి గేటు దగ్గర అజయ్ కోసం నిలబడింది. ఆరడుగుల పొడవూ, వెడల్పాటి చాతీ, ఉంగరాల జుట్టూ, నిండైన ముఖమూ, చిరునవ్వు లొలికించే పెదవులూ. నీలి మేఘశ్యాముని రంగూ - మొగపిల్లలే అతణ్ణి ఈర్ష్యగా చూస్తూ వుంటారు, ఆడపిల్లల కతడు ప్రత్యక్ష మన్మధుడు! రయ్మని మోటారు సైకిలు మీదొచ్చి గేటు దగ్గర అపర్ణని చూసి బ్రేక్ కొట్టాడు, అపర్ణని చూసి చిరునవ్వు నవ్వుతూ.

అపర్ణ కూడా నవ్వింది.

"నా ఉత్తరం చదివి ఇక్కడ నుంచున్నారూ అంటే నా ప్రపోజల్ మీకు నచ్చిందన్న మాట! కోపం వస్తుందేమోనని హడలిపోయాను. అలా క్యాంటీన్ కెళ్ళి కాఫీ తాగుతూ మాటాడుకుందాం. ముందుగా నువ్వు వొచ్చి నందుకు థాంక్స్!" అన్నాడు అజయ్.

"కోపం ఎందుకు? నీ మనసులో మాట నువ్వు చెప్పావు! నా మనసులో మాట నేనూ చెప్తాను!"

ఇద్దరూ క్యాంటీన్లో కూర్చున్నారు.

రెండు కాఫీలు ఆర్డర్ చేశాడు అజయ్.

"అపర్ణా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పె...."

సెలయేటి గలగలలా, పసిపాపలా నవ్వింది అపర్ణ.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అర్థం కానట్టు ఆమె కళ్ళలోకి చూశాడు అజయ్.

"ప్రేమంటే నవ్వొచ్చింది నాకు."

అజయ్ మొహం చిన్నబోయింది.

"అందులో నవ్వడానికేముంది?"

"కథల్లో, సినిమాల్లో, వాస్తవంలో కూడా ఈ మాట విని విని నవ్వొచ్చింది" అంది అపర్ణ.

"తనని వెక్కిరిస్తోందా ఇలా మాట్లాడి లేకపోతే నిజంగానే ఈమెకి ప్రేమ అనే అనుభూతే జీవితంలో కలగలేదా?" అనుకుంటూ ఆమెని పరికించి చూశాడు అజయ్.

ప్రశాంతంగా ప్రవహించే గోదావరి అంత పవిత్రంగా, పసిపాప బోసి నవ్వంత నిర్మలంగా వుంది అపర్ణ మొహం.

"వెక్కిరింత కాదు" అని ధ్రువపరుచుకున్నాడు.

కాఫీ తాగడం పూర్తి చేసి కప్పు కింద పెడుతూ,

"అజయ్! నేనొకటడుగుతాను చెప్తావా?" అంది అపర్ణ.

"అడుగు" అన్నాడు.

"ప్రేమంటే ఏమిటి?"

అజయ్‌కి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీలేదు. నోటమాట పెగలక అవాక్కయిపోయాడు ఒక్క క్షణం. గొంతులో ఏదో అడ్డుపట్టట్టయింది. అసలు ఈ ప్రశ్నకు ఇంతవరకూ కరెక్టుగా సమాధానం చెప్పేరా ఎవరైనా? సమాధానం కోసం తడుముకుంటూ, తడబడుతూ "అపర్ణా! నా దృష్టిలో ప్రేమంటే ఒకరి నొకరు అభిమానించుకోవడం, ఒకరినొకరు కోరుకోవడం! స్త్రీ పురుషులు ఒకరినొకరు మనస్ఫూర్తిగా కావాలనుకోవడం ప్రేమ! తల్లీ బిడ్డలకు మధ్యగల మమతలూ, అనుబంధాలూ ప్రేమ! భార్యకీ భర్తకీ మధ్యగల రాగబంధం ప్రేమ! అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళ మధ్యగల అభిమాన బంధం ప్రేమ! స్నేహితుల మధ్యగల స్నేహబంధం ప్రేమ! ఇవన్నీ దేముడి దశావతారాల్లా ప్రేమకుగల మరో రూపాలు"

"బంధమూలేదు గంధమూలేదు. అంతా స్వార్థం ప్రేమంటేనే స్వార్థం. ఎదుటివారిని తాడులాగ కట్టిపడేసేదే ప్రేమ. యువతీ యువకులు వయస్సులో వారి వాంఛలను తీర్చుకోవడానికి అందంగా పెట్టుకున్న పేరు ప్రేమ. బిడ్డలను తమ చుట్టూ తిప్పుకోవడానికి తల్లిదండ్రులు నేర్పుగా కట్టుకున్న మేడ ప్రేమ. అలాగే అందరూ తమ తమ కోర్కెలు తీర్చుకోవడానికి అనుకూలంగా ముద్దుగా పెట్టుకున్న పేరు ప్రేమ" అంది అపర్ణ.

మైగాడ్! ఏమిటీ ఈ అమ్మాయి ఇంత కఠినంగా ఆలోచిస్తుంది? ప్రేమకు త్యాగగుణంతప్ప స్వార్థమనేదే లేదే! ప్రేమించడం, ప్రేమించబడడం కూడా ఒక గొప్పవరం అంటారు. అటువంటిది, అసలు ప్రేమే అబద్ధం అంటుందేమిటి? ఇంత అందంగా చెక్కిన ఈ బొమ్మకు, బ్రహ్మదేముడు మానసికమైన కదలిక గానీ, ఆర్ద్రతగానీ పెట్టనేలేదా? అదే లేకపోతే మనిషికీ, రాయికీ ఏమిటి తేడా? ఆలోచిస్తున్నాడు అజయ్.

"అపర్ణా! నువ్వెప్పుడూ మీ నాన్నగారిని అమ్మనీ వొదిలిపెట్టి వుండలేదా?" అడిగాడు.

"ఓ.... నాన్నగారు రెండేళ్ళు ఫారెన్ ఎస్సైన్‌మెంటుమీద లండన్ వెళ్లారు. అమ్మ అమ్మమ్మ పోయినప్పుడు నెలరోజులు వెళ్ళి మామయ్య ఇంట్లో వుంది."

"అప్పుడు నీకేమీ అనిపించలేదా? వాళ్ళని చూడాలనీ వాళ్ళతో వుండాలనీ అనిపించలేదా? అలా అనిపిస్తే అదే ప్రేమ!" అన్నాడు.

కళ్ళు గుండ్రంగా తిప్పుతూ, నుదురు చిట్లించి "నో. నాకేమీ అనిపించ లేదు. అవన్నీ సిల్లీ సెంటిమెంట్స్. నాన్న హాయిగా లండన్‌లో వున్నారు. అమ్మ మామయ్యింట్లో వుంది. వాళ్ళకోసం బెంగపెట్టుకోవడం, కన్నీళ్ళు కార్చడం ఫూలిష్‌నెస్," అంది.

అయినవాళ్ళకోసం తాపత్రయపడడం అపర్ణ దృష్టిలో ఫూలిష్‌నెస్. యువతీ యువకులు ప్రేమించుకోవడం అపర్ణ దృష్టిలో కేవలం భావోద్రేకం. అజయ్‌కి మతిపోయింది అపర్ణ మాటలకి.

ఇన్నేళ్ళనుంచీ ఒకే కాలేజీలో ఇద్దరూ చదువుతున్నారు. ఇద్దరికీ పి.జి. కోర్సులు పూర్తయ్యే సమయం వొచ్చేసింది. ఆ తరవాత ఎవరెవరు ఎక్కడుం టారు అనేది వాళ్ళ వాళ్ళ విధి వ్రాతని బట్టి వుంటుంది. అపర్ణ రూపురేఖలూ, ఆమె తెలివితేటలూ, ఆమె ప్రవర్తనా అన్నీ బాగా నచ్చిన అజయ్ తనకి తెలీ కుండానే ఆమెని ప్రేమించడం మొదలెట్టాడు. ఆ విషయం ఆమెకెలా చెప్పాలా అనుకుంటూన్న అతడు ఈ రోజు అనుకోకుండా ఇలా కలుసుకున్నాడు.

"అజయ్! ఏమిటలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అడిగింది అపర్ణ.

"అపర్ణా! నీ మనస్సులో నా మీద ప్రేమ పుట్టేంత వరకూ నీ కోసం నిరీక్షిస్తూ వుంటాను. జీవితంలో తోడు అవసరం. అది కోరుకున్న వారితో కుదిరితే ఆనందం. మరోసారి ఆలోచించు."

అపర్ణ పక పకా నవ్వింది!

అజయ్ ఆమెకేసి చూశాడు. అలా ప్రవర్తిస్తూన్న అపర్ణ మీద అతనికి జాలేస్తోంది. ''మనకోసం బాధపడే మనిషికోసం, ఒక మంచి మాట కోసం మనిషి తపించిపోతాడు. అటువంటిది ఈ మనిషి అవన్నీ 'ఫూలిష్ సెంటి మెంట్స్' అని తోసేస్తుందేమిటి?" బాధపడ్డాడు అజయ్.

* * *

రోజులు గడుస్తున్నాయ్, మధ్యలో ఎన్నోసార్లు అజయ్ అపర్ణా కలుసు కున్నారు. కానీ "అజయ్, నిన్ను ప్రేమిస్తున్నాను" అని అపర్ణ ఒక్కసారైనా అంటుందేమోనని చూస్తే అదేమీ లేదు. అజయ్ మాత్రం ఆమె మీది ప్రేమను చంపుకోలేక పోతున్నాడు. ఒక్కోసారి ''అది ప్రేమా లేక ఆమె అందంపైన ఆకర్షణా?" అనే సంఘర్షణ కూడా అతనిలో కలుగుతోంది.

ఉన్నట్టుండి ఒకరోజు అపర్ణ కంగారుగా వొచ్చి "అజయ్! నీతో అర్జంటుగా మాట్లాడాలి. క్యాంటీన్ కెళదాంరా" అంటూ లాక్కుపోయింది. ఆశ్చర్యపోతూనే అనుసరించాడు.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అడిగింది.

అనుకోని ఆ ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు. వెంటనే ఏం చెప్పాలో తెలీక తికమకపడ్డాడు. కాస్త తమాయించుకుని, ''నన్ను ప్రేమిస్తున్నావా?" అడిగాడు, అప్పుడైనా ఆమె నోటంట ఆ మాట విందామని. ఆమె అప్పుడూ అవునని చెప్పలేదు. "ప్రేమో దోమో నాకు తెలీదు. నాకేదో పెళ్ళిసంబంధం వొచ్చింది. ముక్కూ మొహం తెలీని ఎవర్నో చేసుకోవడం కన్నా, నన్ను కోరుకున్న నిన్నే చేసుకుందామనుకున్నాను. నువ్వు సరేననుకుంటే వొచ్చి మా నాన్నగారితో మాట్లాడు" అంది.

అజయ్‌కి ఆమె భాషా, ప్రవర్తనా మతిపోయినట్టనిపించింది.

ఆ రోజంతా ఆలోచించాడు. ఎంత ఒద్దనుకున్నా అతడి మనసు ఆమెని కోరుకుంటోంది. బహుశా అది ఆకర్షణే కావచ్చు. మనసుకి ఆకర్షణకి మధ్య జరి

గిన సంఘర్షణలో ఆకర్షణే గెలిచింది. మర్నాడేవెళ్ళి అపర్ణ తండ్రి వర్మగారిని కలిశాడు. ఆ తరువాత నెల తిరక్కుండానే అపర్ణా అజయ్‌లు భార్యాభర్త లయ్యారు. అప్పుడయినా ఆమె నోటివెంట "అజయ్, నువ్వంటే నాకిష్టమనో, నిన్ను నేను ప్రేమిస్తున్నాను' అనో వొస్తుందేమో ననుకుంటే అలాంటిదేమీ జరగలేదు. ప్రేమా, గీమా, బెంగపెట్టుకోవడం ఇదంతా నాన్‌సెన్స్ అంటుంటే పిచ్చెక్కినట్టుండేది.

ఏడాది తిరక్కుండానే వాళ్ళకి 'ముకుల్' పుట్టాడు. ముకుల్‌ని చూసి మురిసిపోయారు అజయ్, అపర్ణలు. ఒకరోజు అపర్ణని చూసి "అపర్ణా! మనిద్దరం ఉద్యోగంలోపడి ముకుల్ సంరక్షణంతా ఆయాకే వదిలేస్తున్నాం. పోనీ వాణ్ణి కొన్నాళ్ళవరకూ మా అమ్మ దగ్గర వొదిలేస్తే?" అన్నాడు.

"అలాగే. మీరు చెప్పింది కరెక్ట్. మనం బొత్తిగా వాడిపన్లు చూట్టానికి టైము లేకుండా తయారయ్యాం. అలాగే పంపించేద్దాం'' అంది ఎంతో మామూలుగా.

"అపర్ణా! వాణ్ణి ఒదిలిపెట్టి ఉండడానికి నీకు దిగులుగా వుండదా?" అడిగాడు.

"దిగులెందుకు? వాడు హాయిగా వుండాలనేగా పంపిస్తున్నది. అదే కదా మనకి కావలిసింది కూడా!" అంది ఎంతో మామూలుగా.

ఈ మనిషికి గుండె స్థానంలో బండరాయి పెట్టినట్టున్నాడు భగవంతుడు అనుకున్నాడు. ఇంక "ఆమె మారదు" అనే నిర్ధారణకు కూడా వొచ్చేశాడు.

కాలం గడుస్తోంది. మంచి స్కూలూ, డిసిప్లినూ అంటూ ముకుల్‌నీ నార్త్ ఇండియాలోని డెహరాడూన్ స్కూల్లో చేర్పించి హాస్టల్లో పెట్టారు. సెలవులకి ఇంటికొచ్చి వాడు తిరిగి వెళ్ళిపోతూ వుంటే అజయ్ కళ్ళలో నీళ్ళు తిరిగేవి. కన్నీటి పొరల మధ్య ముకుల్‌ని ముద్దులతో నింపేసేవాడు.

"ఛీ....ప్రాక్టికల్ అజయ్! మన మమతలూ, మమకారాలూ వాడి అభివృద్ధికి అడ్డుగోడలు కాకూడదు" అనేది అపర్ణ. ఆ సంగతి తనకి తెలుసు. అయినా ఏదో అవ్యక్తమయిన బాధ. సాధారణంగా ఈ బాధ మొగాళ్ళకంటే ఆడవాళ్ళకే ఎక్కువ వుంటుందంటారు. అటువంటిది, ఈమెకి అసలు లేదేమిటి? ఎంత ప్రాక్టికల్‌గా ఆలోచించినా, మనస్సనే వలయంనుంచి, మమతనే

టంధం నుంచీ మనిషి బయటపడగలడా? అలా అయితే మనిషి దేముడికన్నా గొప్పవాడయి పోయుండేవాడు అనుకుంటూ అర్థం కాని అపర్ణ గురించి అనేక విధాల ఆలోచిస్తూ వుండిపోయేవాడు.

కాలచక్రం తిరిగిపోతోంది. ముకుల్ ఇంజనీయరై పోయాడు. పెళ్ళికి తొందర లేదంటూ పై చదువులకు విదేశాలకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత కొద్ది కాలానికే సడన్‌గా హార్ట్ ఆటాక్‌తో అజయ్ ఈ లోకంలోంచే వెళ్ళి పోయాడు. మొదటి సారిగా అపర్ణ కంట్లో కన్నీరు చోటు చేసుకుంది. ఏదో రకంగా పనిలోపడి బాధని మర్చిపోవడానికి ప్రయత్నించింది. కాని వయస్సయి పోయిందంటూ ప్రభుత్వం వారు రిటైరుమెంటు కాగితం చేతిలో పెట్టేసరికి, మతిపోయింది అపర్ణకి. పనిలేకపోవడం, ఒంటరితనం ఆమెని పిచ్చిదాన్ని చేసాయి. అజయ్ లేని లోటూ, ముకుల్ లేని లోటూ మొదటిసారిగా ఆమెని వేధించాయి.

"అజయ్! అడుగడుగునా నువ్వు నన్ను షీల్డ్ చేస్తూ వొచ్చావు. మమత కోసం బాధా, ఆప్యాయత కోసం ఆరాటం, ఆవేదనా, ఇవన్నీ నువ్వు చెబుతూ వుంటే నువ్వొఠ్ఠి సెంటిమెంటలిస్టువనీ, నాలాగా ప్రాక్టికల్‌గా ఆలోచించడం లేదనీ అనుకునే దాన్ని. నిన్నూ నీ ప్రేమనీ ఎగతాళి చేసేదాన్ని, నువ్వు లేని లోటు, ఆ ఖాళీ, అందువల్ల కలిగే బాధ, నువ్వు కావాలనుకుని నేను పడే ఆరాటం, ఇదే ప్రేమంటే. నీ ప్రశ్నకి నేను సమాధానం చెప్పేలోపునే నువ్వు నన్నొదిలి వెళ్ళిపోయావు! కనీసం ముకుల్‌కైనా క్షమాపణ చెప్పుకుంటాను. వాణ్ణి వెంటనే నా దగ్గరికి పిలిపించుకుంటాను. ఎక్కడికీ వెళ్ళనివ్వను. నా ప్రాణం పోయినా సరే. నా ఊపిరిగా వాణ్ణి చూసుకుంటాను." పిచ్చి దానిలా ఏడ్చేది. ఇవన్నీ ముకుల్‌కి రాసేది.

ఒకరోజు ముకుల్ దగ్గరినుంచి ఉత్తరం వొచ్చింది. తను ఒక అమెరికన్ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నానని, అక్కడే సెటిలు అయిపోతున్నాననీ, ఆమెకి ఇండియా అంటే ఇష్టం లేదనీ!

అపర్ణ ఉత్తరం చదివి కంటికీ మింటికీ ఏకధారగా ఏడ్చింది.

"బాబూ! నువ్వంటే నా ప్రాణంరా! నువ్వు లేనిదే బ్రతకలేనురా" అంటూ ఏదేదో రాసింది. దానికి సమాధానంగా ఒకే ఒక ఉత్తరం ఒకే

వాక్యంతో రాశాడు ముకుల్. "ప్రాక్టికల్‌గా ఆలోచించు మమ్మీ! నా భార్య కాథలీన్ వాళ్ళమ్మనీ, వాళ్ళ దేశాన్నీ ఒదిలి వుండలేదు. కానీ అలా వుండ గలగడం సెంటిమెంటల్‌గా కాకుండా, ప్రాక్టికల్‌గా బతకడం నువ్వు నాకు చిన్నప్పుడే నేర్పించావు. కనుక నేను రానందుకు నువ్వు బాధపడవనీ, అర్థం చేసుకుంటావనీ అనుకుంటున్నాను.

—నీ ముకుల్."

ఉత్తరం ఎన్నిసార్లు చదివిందో తనకే తెలీదు అపర్ణకి. అది చదువు తూన్నప్పుడల్లా గుండెలో ఎవరో పొడుస్తూన్నట్టనిపించేది.

"బాబూ! నన్ను క్షమించరా! ఆ అమ్మ వేరు, ఈ అమ్మ వేరు. జీవితంలో నేనేం పోగొట్టుకున్నానో తెలిసే సరికి మీ నాన్నగారు నాకు కని పించనంత దూరంగా వెళ్ళిపోయారు. నువ్వూ అందకుండా పోయావు. మమతా, మమకారం జీవితాన్ని నిలబెట్టే ఊపిరితిత్తులు. అవి సరిగ్గా వుంటేనే శ్వాస ఆడుతుంది, బతుకు నిలుస్తుంది. బాబూ, ప్రేమంటే ఏమిటో తెలుసుకునేసరికి నన్ను ప్రేమిస్తున్న వాళ్ళు నాకు కాకుండాపోయారు. రా బాబూ, రా! వొచ్చెయ్! నీ భార్యా నీ పిల్లల్నీ తీసుకుని రా! ఆమెకి ఏ లోటూ వుండదని చెప్పు ఇక్కడ" అంటూ ఎన్నో ఉత్తరాలు రాసింది. నాటి నుంచి నేటివరకు సమాధానం కోసం ఎదురు చూస్తూ, పోస్ట్‌మేన్ కోసం చూస్తుంటుంది.

వార్ధక్యం ముంచుకొచ్చింది. అనుక్షణం ముకుల్‌నే తలుచుకుంటూ ఉత్తరం వొస్తుందనే ఆశతోనే జీవిస్తోంది. ముకుల్ ఒస్తాడు. కోడలొస్తుంది. పిల్లలు నానమ్మా అంటు తనని చుట్టేస్తారు. వాళ్ళతో తను ఆడుకుంటుంది. కథలు చెబుతుంది. యేదో ఆశ....యేవో....ఊహలు....అవే ఆమె ప్రాణాన్ని నిలబెడుతున్నాయి.

"అమ్మగారూ! రండి....భోంచెయ్యండి." వెంకటలక్ష్మి పిలుపు.

"పోస్ట్‌వొచ్చిందా? ముకుల్ ఉత్తరం రాశాడా?" ఇవే అపర్ణ మాటలు.

"వొస్తుంది, మీరు రండి." వెంకటలక్ష్మి సమాధానం.

ఆ జవాబే ఆమెకి కొండంత ఆశ! చెప్పలేనంత బలం!

మెల్లగా గొణుక్కుంటు భోజనం దగ్గర కూర్చుంది అపర్ణ. *